بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 15.03.2019 (Telugu)**

# ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బద్రి అనుచరుల సద్గుణముల ఆసక్తికర ప్రస్తావన

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 15.03.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి. నేడు నేను ప్రస్తావించనున్న మొదటి అనుచరుని పేరు హజ్రత్ సాయిబ్ బిన్ ఉస్మాన్ రజియల్లాహు తఆలా అన్హు. వీరు హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ రజియల్లాహు తఆలా అన్హు కుమారులు. వీరి తల్లి పేరు హజ్రత్ ఖౌలా బిన్తె హాకీం. ఇస్లాం ఆరంభములోనే వీరు ఇస్లాం స్వీకరించిరి. హజ్రత్ సాయిబ్ బిన్ ఉస్మాన్ తన తండ్రి, తన చిన్నాన హజ్రత్ ఖదామాతో కలిసి ఎబిసీనియా వైపు చేసిన రెండవ ప్రస్థానములో పాల్గొనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విల్లుకారులైన అనుచరులలో వీరిని కూడ ప్రస్తావిస్తారు. హజ్రత్ సాయిబ్ బిన్ ఉస్మాన్ బదర్, ఉహద్, ఖందక్ యుద్ధములతో పాటు ఇతర యుద్ధములన్నిటిలో ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. బవాత్ యుద్ధము సందర్భమున వీరిని ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు అమీర్ (అధ్యక్షునిగా) నియమించిరి. బవాత్ యుద్ధము హిజ్రి ద్వితీయ సం॥లో సంభవించెను. బవాత్ మదీనా నుండి సుమారు 48 మైళ్ల దూరాన యున్నది. ఇది జహీనా వర్గపు పర్వతము పేరు. హజ్రత్ సాయిబ్ బిన్ ఉస్మాన్ యమామ యుద్ధములో పాల్గొనిరి. యమామ యుద్ధములో హజ్రత్ అబూబకర్ రజియల్లాహు తఆలా అన్హు ఖిలాఫత్ హయాంలో సంభవించెను. ఇందులో వారికి ఒక బాణము తగిలెను. తర్వాత వారు ఈ గాయముతోనే మృతి చెందిరి. వీరి వయసు 30 సం॥ల కంటే పైన యుండెను.

ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు హజ్రత్ జబ్రా బిన్ అమర్ జహ్నీ. వీరు బనూ తరీఫ్ వర్గమునకు ప్రతిపక్షముగా యుండిరి. కొందరి అభిప్రాయము మేరకు హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ వర్గమైన బనూ సాయిదహ్‌కు ప్రతిపక్షముగా యుండిరి. హజ్రత్ జబ్రా బదర్, ఉహద్ యుద్ధములలో పాల్గొనిరి. ఉహద్ యుద్ధములో వీరు అమరులైరి.

ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు హజ్రత్ సాద్ బిన్ సహల్. హజ్రత్ సాద్ అన్సార్‌లోని వ్యక్తి. వీరు బదర్, ఉహద్ యుద్ధములలో పాల్గొనిరి.

అనంతరం సాద్ బిన్ ఉబైద్ ప్రస్తావన గలదు. హజ్రత్ సాద్ బిన్ ఉబైద్ బదర్, ఉహద్, ఖందక్‌తో పాటు ఇతర యుద్ధములన్నిటిలో హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. వీరు ఖారి అను బిరుదుతో ఖ్యాతి గడించిరి. వీరి మారు పేరు అబూజైద్. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హయాంలో పవిత్ర ఖుర్‌ఆన్ సమకూర్చిన నాలుగు అన్సార్ అనుచరులలో హజ్రత్ సాద్ బిన్ ఉబైద్ పరిగణింపబడుతారు. వీరి కుమారుడు ఉమైర్ బిన్ సాద్ హజ్రత్ ఉమర్ ఖిలాఫత్ కాలములో సీరియాలోని ఒక భాగమునకు పరిపాలకునిగా యుండిరి. ఒక కథనము మేరకు హజ్రత్ సాద్ బిన్ ఉబైద్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో మస్జిద్ ఖుబాలో ఇమామత్ చేసేవారు. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహు తఆలా అన్హు, హజ్రత్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్హు కాలములో కూడ వీరు ఇమామత్ విధులు నిర్వహించేవారు. హిజ్రి 16వ సంవత్సరములో ఖాదిసియా యుద్ధములో హజ్రత్ సాద్ బిన్ ఉబైద్ రజియల్లాహు అన్హు అమరులైరి. అమరులైనప్పుడు వీరి వయసు 64 సం॥లుండెను. అబ్దుర్రహ్మాన్ బిన్ అబూలైలా ఇట్లు ఉల్లేఖించిరి. హిజ్రి 13వ సం॥లో జరిగిన జసర్ యుద్ధములో ముస్లిములకు చాలా నష్టము కలిగెను. ఇందులో హజ్రత్ సాద్ బిన్ ఉబైద్ ఓటమికి గురై తిరిగి వచ్చిరి. అనగా వెనక్కి జరిగిరి. అప్పుడు సీరియాలో జరుగుచున్న జిహాద్‌లో పాల్గొనుటకు ఆసక్తి గలదా అని హజ్రత్ సాద్ బిన్ ఉబైద్‌ను హజ్రత్ ఉమర్ ప్రశ్నించిరి. అక్కడ ముస్లిములతో భీకర యుద్ధము జరుగుచున్నది, ముస్లిములకు చాలా

నష్టము కలిగినదని కూడ అనిరి. జసర్ యుద్ధములో సంభవించిన ఓటమి మచ్చ తొలగించుకోదలచినచో యుద్ధము జరుగుచున్న సీరియాకు వెళ్లగలరని కూడ వారనిరి. హజ్రత్ సాద్ ఇట్లు వేడుకొనిరి. నేను ఓటమికి గురై తిరిగి వచ్చిన మైదానము తప్ప నేను మరెక్కడికి వెళ్లను. నాతో ఘోరంగా వ్యవహరించిన శత్రువులతో పోరాటానికి మాత్రమే నేను వెళ్లుతాను. కావున హజ్రత్ సాద్ బిన్ ఉబైద్ ఖాద్‌సియ్య వచ్చిరి. అక్కడ పోరాడుచు అమరులైరి. అబ్దుర్రహ్మాన్ బిన్ ఉబైద్ అబూ లైలా ఇట్లు ఉల్లేఖించిరి. హజ్రత్ సాద్ బిన్ ఉబైద్ ప్రజల సమక్షమున ఇట్లు ఉపదేశించిరి. రేపు మనము శత్రువులతో పోరాడుతాము. రేపు మనము అమరులమైతాము. కావున మీరు మా శరీరముల నుండి రక్తమును తూడ్చకూడదు. మా శరీరములపై నున్న దుస్తులనే మాకు కఫన్‌గా భావించగలరు.

ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు హజ్రత్ సహల్ బిన్ అతీఖ్. హజ్రత్ సహల్ అతీఖ్ 70 మంది అనుచరులతో కలిసి ద్వితీయ అఖ్బ (సానియా)లో పాల్గొనిరి. వీరు బదర్, ఉహద్ యుద్ధములలో పాల్గొను సత్కారము పొందిరి.

ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు హజ్రత్ సుహైల్ బిన్ రాఫి. వీరు బనూ నజ్జార్ తెగకు చెందినవారు. మస్జిద్ నబ్వీ నిర్మించబడిన స్థలము వీరిది, వీరి సోదరులు హజ్రత్ సహల్ ఆస్థి. హజ్రత్ సుహైల్ బదర్, ఉహద్, ఖందక్ యుద్ధముతో పాటు ఇతర యుద్ధములన్నిటిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. హజ్రత్ ఉమర్ ఖిలాఫత్ హయాంలో వీరు మృతి చెందిరి.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి. సీరత్ ఖాతమున్నబియ్యీన్‌లో ఇట్లు వ్రాసిరి. ప్రస్థానము తర్వాత మదీనాలో నివాసమునకు మొట్టమొదటి పని మస్జిద్ నబ్వీ నిర్మాణమే. ఏ స్థలంలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటె వచ్చి కూర్చొనెనో ఆ స్థలం మదీనాలోని ఇద్దరు ముస్లిం అనాథలైన సహల్, సుహైల్ ఆస్థి. వీరు హజ్రత్ అస్అద్ బిన్ జరారహ్ సంరక్షణలో యుండిరి. ఇదొక నిర్మానుష్యమైన బంజరు భూమిగా యుండెను. దీనిలో ఒక భాగమున ఒకటి రెండు ఖర్జూరపు వృక్షములు యుండగా మిగతా భాగములో కొన్ని శిథిలమైన నిర్మాణములుండెను. దీనిని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మస్జిద్, తమ నివాస గదుల కొరకు ఇష్టపడిరి. 10 దీనారులకు బదులుగా దీనిని కొనుగోలు చేసిరి. స్థలాన్ని సమానం చేసి చెట్లను నరికివేసి మస్జిద్ నబ్వీ నిర్మాణము ప్రారంభించిరి. ఒక కథనము ప్రకారము ఈ భూమి కొనుగోలు చేయుటకు అవసరమున్న నగదు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహు తఆలా అన్హు చెల్లించిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయాన దుఆ చేసి పునాది రాయి పెట్టిరి. ఖుబా మస్జిద్ నిర్మించినట్లే అనుచరులు మేస్త్రీలు, కూలీల రూపంలో పని చేసిరి. ఇందులో ఒక్కోసారి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ స్వయంగా పాల్గొనేవారు.

మస్జిద్ పై కప్పు ఎత్తు అప్పుడు పది ఫీట్లు యుండెను. పొడవు 105 ఫీట్లు యుండెను. వెడల్పు 90 ఫీట్లు యుండెను. మస్జిద్‌లోనే ఒక మూలకు వరండా మాదిరిగా నిర్మించిరి. దానిని సుఫ్ఫ అనేవారు. గృహము లేని నిరుపేద ముహాజిర్లు ఇక్కడ వుండేవారు. వీరు ఇక్కడే వుండేవారు. అస్‌హాబుస్సుఫ్ఫ అనబడేవారు. మస్జిద్‌నకు ఆనుకొని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు నివాస గృహము నిర్మించిరి. గృహము అంటే 10, 15, ఫీట్ల ఒక గది నిర్మించిరి. ఈ గది నుండి మస్జిద్‌లోనికి ప్రవేశించుటకు ఒక ద్వారము కూడ పెట్టిరి. ఈ ద్వారము గుండా వారు సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్ కొరకు మస్జిద్‌లోనికి ప్రవేశించేవారు. వారు సల్లల్లాహు అలైహి వసల్లం మరిన్ని వివాహములు చేసుకున్నప్పుడు ఈ గదితో పాటు అవసరము మేరకు గదులు నిర్మించబడెను. అనంతరం మస్జిద్ చుట్టు ప్రక్కల మరికొందరు అనుచరులు కూడ గృహములు నిర్మించుకొనిరి. మదీనాలో ఈ విధంగా మస్జిద్ నబ్వీ నిర్మించబడెను. ఆ కాలములో జాతీయ కార్యక్రమాలు చేపట్టుటకు మరో ప్రజా భవనము లేనందున ప్రభుత్వ భవనముగా కూడ ఇదే మస్జిద్ ఉపయోగపడేది. ఇదే కార్యాలయము, ఇక్కడే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సమావేశము నిర్వహించేవారు. ఇక్కడే అన్ని రకాల అభిప్రాయములు సేకరించేవారు. ఇక్కడే వాజ్యముల తీర్పు వెలువడేది. ఇక్కడి నుండే ఆదేశములు వెలువడేది. ఇదే జాతీయ సంత్రంగా యుండెను. ప్రతి జాతీయ పనులు ఇక్కడే చేయబడేవి. అవసరమున్నచో ఇక్కడే యుద్ధ ఖైదీలను కూడ బంధించేవారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. సర్ విలియమ్ మియూర్ ఈ మస్జిద్ గురించి ఇట్లు వ్రాసిరి. బాహ్య రూపంలో

ఈ మస్జిద్ నిర్మాణపరంగా అతి నిరాడంబరంగా, సాధారణంగా యుండెను. కాని ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మస్జిద్ ఇస్లామీయ చరిత్రలో ఒక ప్రత్యేక స్థాయి కలిగియుండెను. దైవ సందేశహరులు, వారి అనుచరులు ఇదే మస్జిద్‌లో తమ అధిక సమయము గడిపేవారు. ఇక్కడే ఇస్లామీయ సామూహిక నమాజ్ అధికారికంగా ప్రారంభమయ్యెను. ఇక్కడే ముస్లిములందరు జాతా దైవవాణి వినుటకు శుక్రవారము రోజున గుమికూడేవారు. ఇక్కడ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ విజయముల కొరకు ప్రణాళికలు రచించేవారు. ఇక్కడే ఓటమికి గురైన లేదా పశ్చాత్తాపపడిన తెగల బృందములు వారి ముందే ప్రవేశపెట్టబడేవారు. ఈ ఆస్థానము నుండే రాజ్యాధికార ఆదేశములు వెలువడేవి. వీటి వలన అరబ్‌లోని సుదూర ప్రాంతాలలోని తిరుగుబాటుదారులు భయముతో వణికిపోయే వారు. తుదకు ఇదే మస్జిద్‌తో ఆనుకొని వున్న తమ సతీమణి ఆయిషా గదిలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తుది శ్వాస విడిచిరి. ఇక్కడే తమ ఇద్దరు ఖలీఫాల మధ్యలో సమాధి చేయబడిరి. ఇస్లాం గొప్ప కేంద్రముగా ఆవిర్భవించిన ఈ స్థలమును అందించు భాగ్యము పొందినందుకు హ్రజత్ సుహైల్, వారి సోదరుడు ఎంతో అదృష్టవంతులు.

ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు హ్రజత్ సాద్ బిన్ ఖైసమహ్. హ్రజత్ సాద్ బిన్ ఖైసమహ్ ఔస్ తెగకు చెందినవారు. వీరి తల్లి పేరు హిందె బిన్తె ఔస్. హ్రజత్ సాద్ బిన్ ఖైసమహ్ మరియు హ్రజత్ అబూసల్మా బిన్ అబ్దుల్ అసద్ మధ్య ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం సోదరభావము ఏర్పాటు చేసిరి. బైఅతె అఖ్బ సానియా సందర్భమున ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా ముస్లిముల కొరకు పన్నెండు నఖీబ్ (పర్యవేక్షకుల)ను నియమించిన వారిలో హ్రజత్ సాద్ కూడ ఒకరు.

సీరత్ ఖాతమున్నబియ్యీన్‌లో హ్రజత్ మిర్జా బషీర్ అహ్మద్ ఇట్లు వ్రాసిరి. నబ్వీ 13వ సంవత్సరము జిల్‌హజ్జ మాసములో ఔస్, ఖ్రజ్‌నకు చెందిన కొన్ని వందల మంది మక్కాకు వచ్చిరి. వీరిలో 70 మంది ముస్లిములైరి లేక ఇస్లాంలో చేరబోవుతుండిరి. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణీత సమయములో రాత్రి ఒంటరిగా ఇంటి నుండి బయలు దేరి మార్గములో ఇంకా ఇస్లాంలో ప్రవేశించకున్నను తమను ఆప్యాయంగా ప్రేమించే తమ చిన్నాన అబ్బాస్‌ను వెంటబెట్టుకొనిరి. ఇద్దరు కలిసి ఆ లోయకు చేరుకొనిరి. కొద్ది సమయములోనే అన్సార్ కూడ ఒక్కొక్కరు లేదా ఇద్దరిద్దరు అక్కడికి చేరుకొనిరి. మొట్ట మొదట అబ్బాస్ ఇట్లు మాట్లాడిరి. ఓ ఖ్రజ్ వర్గీయులారా! ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ వంశములో గౌరవనీయులు, ప్రియమైనవారు. ఆ వంశము నేటి వరకు అతని రక్షణకు బాధ్యత వహించుచున్నది. ప్రతి ప్రమాద సమయములో అతని కొరకు రక్షణగా నిలిచినది. కాని ఇప్పుడు ముహమ్మద్ తమ స్వదేశమును వీడి మీ వద్దకు రావాలని నిర్ణయించుకున్నాడు. మీరు అతన్ని తమ వద్దకు తీసుకొని పోదలచినచో అన్ని రకాలుగా అతనికి రక్షణ కల్పించవలెను. ఇందుకు మీరు సిద్ధముగా యున్నచో మంచిది. లేనిచో ఇప్పుడే స్పష్టంగా చెప్పండి. ఎందుకనగా స్పష్టమైన విషయము ఎప్పటికి మేలైనదే. అన్సార్ తెగలలో ఒక పెద్ద వయస్కులైన, ప్రభావశీలి వ్యక్తి బరా బిన్ మారూర్ ఇట్లు బదులిచ్చిరి. ఇప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా తమ నోటితో కొన్ని మాటలు చెప్పాలని మేము ఆశించుచున్నాము. అప్పుడు ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూక్తులు చదివిరి. అనంతరం సంక్షిప్త ఉపన్యాసములో ఇస్లాం బోధనను తెలిపిరి. దైవ హక్కులు, మానవ హక్కులను వివరించుచు మీరు మీ సమీపులను, బంధువులను రక్షించినట్లే అవసరమేర్పడినచో నాతో వ్యవహరించవలెనని మాత్రమే నేను ఆశించుచున్నాను అని తెలిపిరి. బరా బిన్ మారూర్ అరబ్ ఆచారము ప్రకారము వారి హస్తమును తమ చేతిలో పెట్టుకొని ఇట్లనిరి. ఓ దైవ ప్రవక్తా! మిమ్ములను సత్యము, నిజముతో పంపిన అల్లాహ్ తఆలా ప్రమాణము. మేము మా ప్రాణముల వలె మీకు రక్షణ కల్పింతుము. మేము ఖడ్గముల నీడన పెరిగినాము. అనంతరం ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో వారిట్లు అడిగిరి. మేము ఇదంతా చేస్తాము. కాని ఇందుకు మాకే ఫలితము లభించును. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీకు అల్లాహ్ స్వర్గము లభించును. ఇది అతని బహుమానములలో అన్నిటికంటే పెద్ద బహుమానము. మేము ఈ వ్యాపారమును అంగీకరించుచున్నాము, ఓ దైవ ప్రవక్తా! మీరు మీ హస్తమును ముందుకు చాపండి అని అందరనిరి. అప్పుడు వారు తమ హస్తము ముందుకు వాల్చిరి. ఈ 70 మంది త్యాగమూర్తుల బృందము రక్షణ

ఒప్పందములో వారి హస్తమున అమ్మబడిరి. ఈ బైఅత్‌ను బైఅతె అఖ్బ సానియా అంటారు. బైఅత్ తర్వాత ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం పన్నెండు మంది పర్యవేక్షకులను నియమించిరి. వారి పేర్లు ఇట్లు గలవు. అస్అద్ బిన్ జరారహ్, ఉసైద్ బిన్ హజీర్, అబుల్ హైసమ్ మాలిక్ బిన్ తైహాన్, సాద్ బిన్ ఉబాదహ్, బరా బిన్ మారూర్, అబ్దుల్లాహ్ బిన్ రవాహ, ఉబాదహ్ బిన్ సామిత్, సాద్ బిన్ రబీ, రాఫి బిన్ మాలిక్, అబ్దుల్లాహ్ బిన్ అమర్, సాద్ బిన్ ఖైసమ్, మున్జిర్ బిన్ అమర్.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హ్రజత్ సాద్ బిన్ ఖైసమహ్‌కు ఖబాలో ఒక బావి యుండెను. దాని పేరు అల్‌ఘరస్. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ బావి నుండి మంచి నీళ్లు త్రాగేవారు. వారిట్లనేవారు. ఇది స్వర్గములోని చెలిమలలోని ఒక చెలిమ. దీని నీళ్లు చాలా తియ్యగా యున్నవి. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన తర్వాత వారిని ఈ బావి నీటితోనే స్నానం చేయించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లని యుండిరి. నేను మృతి చెందినప్పుడు ఘరస్ బావి నుండి ఏడు కుండల్లో నీళ్లు తెచ్చి ఆ నీటితో నాకు స్నానం చేయించండి. నబీ సల్లల్లాహు అలైహి వసల్లంను మూడు సార్లు స్నానం చేయించిరి. హ్రజత్ అలీ, హ్రజత్ అబ్బాస్, హ్రజత్ ఫజల్ కలిసి వారికి స్నానం చేయించిరి.

సులెమాన్ బిన్ అబ్బాన్ ఇట్లనిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బదర్ కొరకు బయలు దేరినప్పుడు హ్రజత్ సాద్ బిన్ ఖైసమహ్, వారి తండ్రి ఇద్దరు కలిసి పోవుటకు సంకల్పించిరి. ఇద్దరిలో ఒక్కరు మాత్రమే పోగలరు. కనుక చిట్టి వేసుగోగలరని ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. హ్రజత్ ఖైసమహ్ తన కుమారుడైన సాద్‌తో ఇట్లనిరి. మనిద్దరిలో ఒక్కరు మాత్రమే పోగలరు. కావున స్త్రీల రక్షణ కొరకు నీవు ఇక్కడే వుండు. హ్రజత్ సాద్ ఇట్లనిరి. స్వర్గము కాక పోయినచో నేను మీకు తప్పక ప్రాధాన్యతనిచ్చేవాడిని. కాని నేను స్వయంగా అమరత్వాన్ని ఆశించుచున్నాను. కావున ఇద్దరు చిట్టి వేసుకొనిరి. చిట్టి హ్రజత్ సాద్ పేరున వచ్చెను. కావున వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి బదర్ వైపు బయలు దేరిరి. అనంతరం బదర్ యుద్ధములో అమరులైరి.

మరో కథనము ప్రకారము బదర్ యుద్ధములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట రెండు అశ్వములుండెను. ఒకటి ముస్అబ్ బిన్ ఉమైర్ వద్ద మరొకటి హ్రజత్ సాద్ బిన్ ఖైసమహ్ వద్ద యుండెను. హ్రజత్ జుబైర్ బిన్ అవ్వామ్, హ్రజత్ మిఖ్దాద్ బిన్ అస్వద్ వంతుల వారీగా వాటిపై స్వారి అయ్యేవారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హ్రజత్ మిర్జా బసీర్ అహ్మద్ అభిప్రాయము మేరకు బదర్ యుద్ధములో ముస్లిముల వద్ద 70 ఒంటెలు రెండు అశ్వములుండెను. అవిశ్వాసుల వద్ద యున్న ఆయుధములు, అశ్వములు, ఒంటెలకు పోటీగా ముస్లిముల వద్ద యున్న ఆయుధములు అతి కొద్దిగా యుండెను. కాని ముస్లిములపై దాడి చేయబడినప్పుడు అనగా బలవంతంగా యుద్ధములో నెట్టబడినప్పుడు అవిశ్వాసులు ఇస్లాంను అంతము చేయాలని భావించి వచ్చిరి. విశ్వాసులు తమ ఆయుధములను చూడకుండా అల్లాహ్ తఆలా కొరకు త్యాగములు సమర్పించిరి. అల్లాహ్ తఆలా ఈ త్యాగమును స్వీకరించి వినయము కూడ నొసంగెను. అల్లాహ్ తఆలా అనుక్షణం ఈ అనుచరుల స్థాయి అంతస్థులను పెంచును గాక! ☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................................

..........................................................................

..........................................................................